

# మారిన గౌరణి

కొత్త అన్యోన్యంగా, అనురాగంగా కనబడ్డ దంపతు లెక్కడైనా కంటబడితే, ఒకళ్ళకి తెలియకుండా ఒకళ్ళం, మా ఆవిడా నేనూ వాళ్ళ అదృష్టాన్ని మెచ్చుకుంటూ అసూయ పడుతూ వుండటం యీ మధ్య పరిపాటైపోయింది. యింతకీ మా యిద్దరి మధ్యా పొత్తు

చెడటానికి కారణం మా ఆవిడ మొండితనమే నని నా నమ్మకం; కేవలం నా మొండితనమేనని ఆవిడ వాదన. అందులోనూ యీ మధ్య మా అమ్మాయి పెళ్ళయిన దగ్గర్నుంచి మరీ మా యిద్దరివీ యెడ మొహం, పెడమొహం అయ్యేయి. దానికి కారణ మేమిటంటే— మా ఆవిడ బంధువర్గంలో మా అమ్మాయికి యీడైన పెళ్ళి కొడుకులు కౌరవ సైన్యంలాగా లెక్కకి మించినంతమంది వున్నప్పటికీ — మా అమ్మాయి మా అక్కయ్య కొడుకును పెళ్ళాడటం. ఇంతకీ యిదంతా నేనూ-మా అమ్మాయీ, మా అబ్బాయి కలసి తనని అవమానం చెయ్యటానికి పన్నిన కుట్రని దాని అభిప్రాయం. కాదు మొర్రో అని నచ్చ చెప్పటానికి ప్రయత్నించడం, చెవిటివాడి ముందర 'లతామంగేష్కర్' రికార్డు లాంటిది.

అక్కడి కథఅలా వుండగా, మా వాడికి పాతికేళ్ళొచ్చాయి. చదువు పూర్తయ్యింది. ఏమాట కామాటే చెప్పుకోవాలి. మా వాడు చదువులో ఫేలయిన సంవత్సరాలకంటే, ప్యాసయిన సంవత్సరాలే ఎక్కువ. ఉద్యోగం కూడా వెతగక్కర్లేకుండానే నాకు తెలుసున్న కంపెనీలో దొరికింది. సంవత్సరంగా నేనూ, మా ఆవిడా ఒకళ్ళకి తెలియకుండా ఒకళ్ళం మా వాడికి పెళ్ళిసంబంధాలు చూపెడుతున్నాం. వాడికి నచ్చటం లేదు. చివరకి నిలదీసి అడుగుతే తను ప్రేమ వివాహం చేసుకొంటానన్నాడు. సరే అదేదో త్వరగా కానిమ్మన్నాను. నిజానికి నాకు భావస్వాతంత్ర్యంమీద నమ్మకం ఎక్కువ. నా ముప్ఫై ఏళ్ళ దాంపత్య జీవితానుభవంవల్ల ననండి, ఈ పదిహేనేళ్ళనుంచి చూస్తున్న సినిమాలవల్ల ననుకోండి యీ ప్రేమవివాహాలమీద నమ్మకం కుదిరింది. ప్రేమించడం నేర్చుకోడానికి ఒక్క సినిమా చూస్తే చాలు. అలాంటిది సినిమా పండితుడైన మా అబ్బాయికి బ్రహ్మవిద్య ఏనాడో కరతలామలకం అయివుండాలి. అదీకాక ప్రేమించడమంటే అంత కష్టమైన పనేమీలాగ కన్పడటంలేదు. ఇంట్లో అయితే మంచాలచుట్టూనో, సోఫాలచుట్టూనో, తోటలో అయితే చెట్లుచుట్టూ,

పుట్టచుట్టూ, అబ్బాయి అమ్మాయి కలిసి పరుగులెత్తడం, చేతనైతే పాటలు పాడటం. తర్వాత విరహంతోటి కమ్మరి కొలిమిలాగ బుస్సు బుస్సుమంటూ నిట్టూర్చడం. పైగా యీ ప్రేమకి సమయంగాని, స్థలం కాని నిర్ణయం లేదు. వాళ్ళ వాళ్ళ అభిరుచుల్నిబట్టి పగలుగాని, రాత్రి గాని, రోడ్డుమీదగాని, కాలేజి కాంపౌండులోగాని, రైల్లోగాని, పడవలోగాని—ఎక్కడైనా యీ ఘట్టాన్ని ఆరంభించవచ్చు. తర్వాత అబ్బాయితరఫునో, అమ్మాయితరఫునో తల్లీ తండ్రీ అడ్డుపెట్టడం, చివరి ఘట్టంలో యిలా అడ్డుపెట్టినందుకు లెంపలేసుకుని వాళ్ళ పెళ్ళికి ఒప్పుకోవడం సినిమాల్లో చూస్తూనేవున్నాం. అంచేత నేను అడ్డుపెట్ట తలచుకోలేదు. లెంపలేసుకోదలచుకోలేదు. మావాడి కిష్టమొచ్చిన పిల్లని పెళ్ళాడమన్నాను.

ఆ మధ్య మా వాడు నాల్గురోజులు సెలవు దొరకితే యింటి కొచ్చాడు. మొదటిరోజు మా ఆవిడ మేనరికాన్ని గురించి నూరి పోసింది. రెండో రోజున భోజనం చేస్తుంటే 'నేను జలజఅనే అమ్మాయిని పెళ్ళాడటానికి నిశ్చయించుకున్నాను' అన్నాడు.

'ఎవరూ! జలగా!' అంది మా ఆవిడ. 'జలజ'న్నమాట ఆవిడ సాహిత్య పరిధిలో లేదు.

'అబ్బే, జలజంటే... ...' అంటూ మా వాడు తీరుబడిగా వ్యుత్పత్త్యర్థంతోసహా చెప్పాడు. ఆ అమ్మాయి బి. యే. చదువుతుందిట. చాలా అభ్యుదయ భావాలు కలదిట. పైగా మంచి వుపన్యాసకురాలట కూడాను. ధోరణి అంతా చూస్తే చాలా ఘాటుగా ప్రేమించినట్లుగా కూడా కనబడుతున్నాడు.

'అంత నువ్వు పిల్లని వెతుక్కుని పెళ్ళాడవల్సిన ఖర్మ ఏ మొచ్చిందిరా ?' అంటూ గడ్డంమీద వేళ్ళెట్టుకొని దీర్ఘం తీసింది మా ఆవిడ. మళ్ళీ వేళ్ళు తీసేటప్పటికి గెడ్డం అంతా మసితోవున్న వేలిముద్రలు.

'ఆ అమ్మాయిని ప్రేమించాను' అన్నాడు మావాడు.

'అంత ముక్కు మొహం ఎరగని పిల్లనే ప్రేమించకపోతే ... పెద్దమామయ్య కూతుర్నో, చిన్న మామయ్య కూతుర్నో నా మాట విని ప్రేమించరా' అని ప్రాథేయ పడింది

'ఒక అమ్మాయిని ప్రేమించిన హృదయంతో మరో అమ్మాయిని ప్రేమించడం కుదరదే' అన్నాడు మావాడు, ప్రేమతత్వాన్ని, దాని తాలుకు సిద్ధాంతాన్ని విశదీకరిస్తూ.

'ప్రేమించడ మంటే'అంది యీసారి ఆ మసివేళ్ళు బుగ్గలమీద పెట్టుకుని. నిజానికి సినిమాలు చూడక పోవడంవల్ల చిక్కేయిది.

మా ఆవిడ భయపడ్డట్టు ప్రేమించడమంటే అంత చెయ్యిదాటి పోయిన దారుణ వ్యవహారమేమీ కాదని చెప్పే వుద్దేశ్యంతో 'అబ్బే... ప్రేమించడమంటే ... ఏమీలేదు, అదే... సినిమాల్లోలాగ ... ఉత్త ప్రేమించడం' అన్నాను. అసలే ఆ 'ప్రేమని' నిర్వచించడం మహా కష్టం. పైగా విశ్వరూపంలాగా కనబడుతూంది మా ఆవిడ మొహం మీద మసి. దాంతో అసలే మాటలు తరబడ్డాయి.

'అలాగా!' అంది మా ఆవిడ ...ఇదికూడా నా పన్నాగమే అన్నట్టు మనస్సులో వ్యాఖ్యానం చేసి కొంటూ. దాంతో మా ఆవిడతో రాజీ చేసుకుందామని చేస్తున్న నా ప్రయత్నాలన్నీ గంగపాలయ్యాయి.

* * *

మహేశం యీ వూరొచ్చి రెండేళ్ళయింది. క్లబ్బులో కలును కోడం తప్ప వాడింటి కెప్పుడూ వెళ్ళలేదు. సాయంత్రం షికారుగా బయలుదేరి అంత శ్రమపడి వెళ్ళిందాకావుండి వాడింట్లో లేడు. తిరుగు మొహంపట్టి రెండు ఫర్లాంగులు నడిచే టప్పటికి చినుకులు ప్రారంభించేయి. కనుచూపు మేరలో రిక్షా కన్పడడంలేదు. వర్షం ఎక్కువయ్యే సూచనలు కనబడుతున్నాయి. ఖాళీగా వరండావున్న

బిల్డింగు కనబడింది. పెద్ద బోర్డుకూడా కట్టి వుంది. అదేదో ఆఫీసయి వుంటుందని గబగబ మెట్లెక్కుతున్నాను. అప్పుడే వర్షం ఎక్కువవ్వడం, వరండా మీదికి తెరచుకున్న తలుపులు భళ్ళున మూయబడటం జరిగేయి. వరండాలోకి వెళ్ళగానే లోపల్నుంచి కోలాహలం వినబడుతూంది. వరండాలో గోడకి తగిలించిన నోటీసుబోర్డు చూశాను. 'నీరా విజ్ఞాన...' అని కనబడింది.

కొంపతీసి నీరా తాగితే విజ్ఞానం వస్తుందనికూడా ప్రచారం చేస్తున్నారేమిటి చెప్మా అని సందేహం కలిగి, పైగా యీ నీరా కేంద్రంలో జొరబడినందుకు ఎవరైనా చూస్తే ఏమనుకుంటారోనని హడలిపోతూ జేబులోనుంచి కళ్ళజోడు తీసి తగిలించి మళ్ళీ చదివాను అది కేవలం నా చత్వార దోషమేకాదు. అక్షరాల పొందిక దోషంకూడాను. ఇదిగో యీ అక్షరాలు అష్టవంకర్లగానూ రాయడం పెద్ద కళైపోయింది. మొన్న మా అవధాన్లుగారు చెబితే విన్నాను. గోదావరిలో స్నానంచేసి, ఆలయంవీధిలో సత్రం వుందని విని ఆ వీధమ్మటే ప్రతి బోర్డూ చూచుకుంటూ వెళ్ళేరుట. ఏవో నిలువుగీతలతోటి, లతలతోటి చెక్కిన అక్షరాలు ఓ బోర్డుమీదకనబడ్డాయట. కష్టంమీద ఆఖరుఅక్షరాలు 'ధర్మశాల'అని పోల్చుకొని తలుపు తోసుకొని లోపలికెళ్ళి వెంట్రుకలు మీద పడకుండా బయటబడేటప్పటికి తలప్రాణం తోకకి వచ్చిందట. బయటికొచ్చి ఆ గూఢ లిపి ఏమిటా అని వాకబు చేస్తే 'క్షుర కర్మశాల' ని తేలింది, ఇంతకీ అది నీరాకాదు. 'నారీ విజ్ఞాన సమితి'... ఆరోజు అక్కడ సభ జరుగుతుందని నోటీసు, వక్తల పేర్లుకూడా వున్నాయి. అన్నీ విపులంగా చదువుదామని కళ్ళజోడు సర్దుకుంటూంటే 'దయచేయండి' అని ఓ ఆడగొంతుక వినబడింది. లోపలికా, బయటికా అని సందేహం కలిగి వెనక్కు తిరిగాను. మధ్య వయిస్సులో వున్న ఒకావిడ వినయ పూర్వకంగా 'క్షమించాలి. వర్షం జల్లు మూలాన్ని తలుపులు మూసేశాం ... ఇలా లోపలికి దయచేయండి' అంటూ లోపలికి ఆహ్వానించింది.

హాలంతా ఆడవాళ్ళతో కిక్కిరిసిపోయి వుంది. అసలే ఆడ వాళ్ళంటే నాకు కొంచెం అదోలాగుంటుంది. అందులోనూ చదువు కున్న వాళ్ళంటే మరీను. పైగా ఉపన్యాసాలిచ్చే వాళ్ళనడంతో కే ముచ్చెమటలు పోశాయి. హాల్లో ఒక్క మూల మాత్రం మొగాళ్ళ కోసం లాగుంది ఓ డజను కుర్చీ లున్నాయి. నే నెళ్ళేటప్పటి కింకా రెండు మూడు కుర్చీలు ఖాళీ వున్నాయి. ఎందులో కూర్చోటమా అని తటపటాయిస్తుంటే మునిసిపల్ ఛైర్మన్ పద్మనాభం నా లాల్చీ పట్టుకు లాగి తన పక్క కుర్చీలో కూలేశాడు. భుజంమీద ఎవరిదా చేయి పడిందని వెనక్కి తిరిగి చూస్తే రిటైర్డ్ పోలీసు సూపర్నెంట్ రాఘవరావు. ఈ సభకు హాజరయ్యే అదృష్టం నా ఒక్కడికే కాదని హృదయం దిట్టవు పరచుకుని కూర్చున్నాను. సభా వేదికమీద ఓ అమ్మాయి ఏదో మహా ఆవేశంలో వుపన్యాసం యిస్తూంది. క్షణంలో అందరిలాగే నేనూ కొయ్యబారిపోయి గుడ్లప్పగించి చెవులు రిక్కపొడుచుకొని వినడం మొదలెట్టాను.

'ఒక్కసారి ప్రపంచ జనాభా లెక్కమీదికి మీ దృష్టి మళ్ళిం చండి. ఈ నాడు ప్రపంచంలో పురుషుల జనసంఖ్యకంటే స్త్రీలే ఎక్కువ. ఐనప్పటికి సమాజంలో వున్నతస్థానం అధిష్టించింది పురుషులు. నూటికి కోటికి ఒకళ్ళిద్దరు స్త్రీలు తప్పిస్తే చదువుకున్నవాళ్ళు పురు షులు. ఉద్యోగాలు చేసేవాళ్ళు పురుషులు. సంఘసంస్కర్తలు పురు షులు. మతబోధకులు పురుషులు. కళారాధకులు, జాతీయనాయకులు పురుషులు. దేశ పాలకులు పురుషులు... ...ఇక యీ స్వార్థపరులైన పురుషులు మనకి బోధించే దేమిటంటే... ...పతియే దైవం, ఇల్లే స్వర్గం. పిల్లలే మోక్షం. వయోజన ఎన్నిక పద్ధతి అమలులోవున్న ఈ నాడు మన స్త్రీ లందరు నడుంకట్టి ఎలక్షన్లలో పురుషులతో పోటీ చేస్తే రాజ్యసభలోకాని, లోక్ సభలోగాని ఒక్క పురుషుడికి స్థాన ముండునా... ...!'

ఇలా మెషిన్‌గన్‌లాగ చెవులూ, తద్వారా మా హృదయాలూ తూట్లు పడేలాగ ఏకధాటిగా యిస్తున్న ఆ వుపన్యాసానికి సభా మధ్యం నుంచి కెవ్వుమంటూ ఆలాపించడం మొదలెట్టిన చంటిపిల్లాడి ఏడుపు సడన్ బ్రేక్ వేసింది. కాస్తంతా వూపిరి తిరిగింది కదా అని సంతోషించి 'ఎవరా అమ్మాయి ... ... ఏమాకథ ?' అన్న కొశ్చన్‌మార్క్ మొహంతో పద్మనాభాన్ని గోకేను. 'ఆ అమ్మాయి పేరు జలజట' అన్నాడు. 'జరదా' అని పెట్టుకోవల్సింది అన్నాడు పోలీస్ సూపర్నెంట్ రాఘవరావు. ఈ అమ్మాయే మా కాబోయే కోడలన్న విషయం జ్ఞాపకం రాగానే ఎవరో వెన్నుమీద తన్నినట్టుయింది.

ఇంకా ఆ పసివాడు ఏడుపు మానలేదు. ఆ యేడ్పు మాన్పడానికి అవలంబించ వలసిన కార్యక్రమం యిదమిత్థమని తేలలేదు. కేవలం సలహా రూపంలోనే వుంది. ఎత్తుకోమని కొందరు, మంచినీళ్ళిమ్మని కొందరూ, పిప్పర్మెంట్టిమ్మని కొందరూ, కాస్త బయటికి తీసికెళ్ళి చల్లగాలిలో తిప్పమని కొందరూ. మా ప్రక్కనున్న వరుస బెంచీలో లేడీ డాక్టరు లాగుంది. అమెరికాలో నెల్లాళ్ళ పసిగుడ్డును సహితం మీటింగుల్లో ఏడవకుండా ఎలా తర్ఫీదిస్తారో ప్రక్కనున్న వాళ్ళందరికి బ్రతిమాలి చెబుతోంది.

చంటిపిల్లాడి ఏడ్పుస్థాయి హెచ్చిందిగాని తగ్గలేదు. ఉపన్యాసకురాలు గత్యంతరంలేక కూర్చుంది. సభాసదుల సహనం సన్నగిల్లింది. పిల్లాడి నోట్లో గుడ్డలు కుక్కమనడమూ, పీక నులిమెయ్యడమూ అన్నంత అనురాగంతో అందరూ ఆ తల్లీ పిల్లాడికేసి చూడడం మొదలెట్టారు. ఓమూల నిట్టూర్పులతో హాలంతా ప్రతిధ్వనిస్తుంటే, ఆ చంటి పిల్లాడి ఏడుపు అంటురోగంలాగా వ్యాపించి మూల మూలల్నుంచి పిల్లికూతలు వినబడడం ఆరంభించాయి. ఇదే సమయమనుకుని మేము బయటపడ్డాం.

'ప్రతి మీటింగూ యిలాగే వుంటుందేమో'! అన్నాను.

'ఇకమీదట జరగబోయే రాజ్యసభలకీ, లోక్‌సభలకీ నమూనా' అన్నాడు పద్మనాభం.

'నీ కేమైనా ప్రత్యేకాహ్వానం వచ్చిందా? నువ్వు మాలాగే వర్షానికి కొట్టుకొచ్చావా?' అన్నాడు రాఘవరావు వాళ్ళనుగురించి నాకు కల్గిన అనుమానాన్ని పటాపంచలు చేస్తూ.

ఇంతలోకే ఎక్కడనుంచి వూడిపడ్డాడో హాల్లోంచి మహేశం వచ్చి, చప్పట్లుకొట్టి మమ్మల్ని ఆపి 'అప్పుడే వెళ్ళిపోతున్నారే!... ... మా అమ్మాయి వుపన్యాసం పూర్తిగా వినకుండా!' అన్నాడు.

'మీ అమ్మాయా!' అన్నాడు రాఘవరావు, పూర్వపు అల వాటుప్రకారం రివాల్వర్‌కోసం మొల తడుముకుంటూ.

'ఎలా వుంది ఉపన్యాసం?' అంటూ పద్మనాభాన్ని పలకరించాడు.

'ఝంఝూ మారుతం లాగుంది... ...ఇంతకీ కేవలం ఉపన్యాసా లివ్వడమేనా... కాస్తంత మల్ల యుద్ధం కూడా నేర్పించావా!' అని అడిగాడు పద్మనాభం.

నా ప్రశంసకోసం మహేశం నా వైపుకు తిరగ్గానే 'బ్రహ్మాండంగా వుందిరా నీ తర్ఫీదు' అన్నాను. మధ్య నా కొంపమీదికి తెచ్చినందుకు మనస్సులోనే వాడిమీద శాపనార్థా లెట్టుకుంటూ.

'పిల్లల్ని పెంచడం నాదో ప్రత్యేకత... వాళ్ళ వాళ్ళ మన స్తత్వాల్నిబట్టి, సహజమైన భావ సంపత్తినిబట్టి...' ఇంకా ఏదో వాగబోతున్నాడు.

'ఏడిశావుగాని ... వెర్రివెర్రి వేషాలెయ్యక త్వరగా పెళ్ళి చేయి. ఇలాంటి సీమటపాకాయ ఉపన్యాసాలు యింతటితో మాన్పించకపోతే తర్వాత పెళ్ళికూడా అవదు' అన్నాడు రాఘవరావు.

'ఆ విషయంలో మా అమ్మాయిని గురించి నాకు బెంగలేదు. పెళ్ళికూడా త్వరలోనే నిశ్చయం కాబోతోంది.'

'సంబంధం స్థిరపరిచేవా ?

'మా అమ్మాయే ఎవణ్ణో ప్రేమించిందట.'

'మరి వాడు మీ అమ్మాయిని ప్రేమించక్కర్లేదూ ?'

'ప్రేమించాడట'

'అయితే యీ దేశంవాడయి వుండడు. ఏ రష్యన్ రెడార్మీ సోల్జరో, సర్కస్ పహిల్వానో అయివుండాలి.'

'అబ్బే మన దేశం వాడూ, మన రాష్ట్రంవాడూ, మనవూరు వాడూట కూడాను ... ...'

'పాపం! ఎవరబ్బాయి ?' అన్నాడు రాఘవరావు. నా ప్రాణం చివుక్కుమంది.

'ఎం. ఎ. ప్యాసయ్యేడట. బెజవాడలో ఏదో కంపెనీలో పని చేస్తున్నాడు.'

'మరింకెందుకు ఆలస్యం ?'

'మా అమ్మాయి కొన్ని షరతులు పెట్టిందట!'

'ఏమిట్రోయ్!' అన్నాను.

'మా అమ్మాయికి పెళ్ళయినతర్వాత కూడా స్వాతంత్ర్యం కావాలిట.'

'అంటే... ... ఓ హృదయేశ్వరీ! ఈ యిల్లు నీది, ఈ గరిటెలు, ఈ గిన్నెలు, ఈ కుంపటి, ఈ కాఫీఫిల్టరు... ... ...అన్నీ నీవే. కేవలం వంటచేయడం నీ కో సరదా కాబట్టి, పైగా నామీద నీకుండే అనురాగంచేత వంటచేస్తున్నావుగానీ, నువ్వు నా బానిసవు కావు. నువ్వు సర్వస్వతంత్రురాలివి' అంటూ ఉదయం, సాయంత్రం, వీలైతే మధ్యాహ్నంకూడా భర్త కాస్త స్తోత్రంచేస్తూ వుండాలి' అంటూ వ్యాఖ్యానం చేశాడు రాఘవరావు.

'మరి పెళ్ళయిన తర్వాతకూడా నారీ అభ్యుదయానికి సేవ చేయడానికి, మీటింగులకి, క్లబ్బులకి వెళ్ళటానికి అభ్యంతరం పెట్టకూడదట.'

'భేష్. అంటే పార్ట్‌టైమ్ వైఫ్‌గా వుంటుందన్నమాట' అన్నాడు పద్మనాభం.

'మూడోది... తనకెప్పుడు బుద్ధిపుడితే అప్పుడు ఉద్యోగంలో చేరుతుందిట.'

'నిజానికి వుద్యోగంచేస్తే ప్రతి ఆడదానికి తిక్క కుదురుతుంది. ఒక్క మొగుడితో వేగలేక ఉద్యోగంలో చేరిన ఆడది నూటతొంభై మొగుళ్ళుండే ఉద్యోగాల్లో చేరి నెగ్గుకొచ్చేదేమిటి?' అంటూ విమర్శించేడు రాఘవరావు.

'నాలుగోది... ... ...కట్నం చట్టవిరుద్ధమే కాకుండా... ... సాంఘిక దురాచారం కాబట్టి రహస్యంగాకూడా ఏవిధమైన ధనం భర్త అర్థించకూడదు.'

'ఇన్ని షరతులకు ఒప్పుకొని పెళ్ళాడి సంసారం చేయడంకంటే... ఆ రష్యన్ స్పుట్నిక్ ఎక్కి ప్రయాణం చేయడం సుఖం'

అన్నాడు పద్మనాభం. పెళ్ళికొడుక్కు కలగబోయే దాంపత్య సుఖం వర్ణిస్తూ అప్పటికి మహేశం ధోరణి వింటూంటే నా ఒళ్ళు బాయిలర్ లాగ మండి పోతూంది. దీంతోటి నా రక్తనాళాల్లో గొంగళి పురుగులు పాకుతున్నట్టనిపించింది... చూస్తూ చూస్తూ మా కుర్రాణ్ణి ఈ పెళ్ళి స్పుట్నిక్ ఎక్కించడమా అని.

"ఇంక అయిదో షరతు..."

"నోర్మూయ్...చూస్తాను మా అబ్బాయి, మీ అమ్మాయి నెలా పెళ్ళాడుతాడో...షరతులట...షరతులు" అనేశాను ఆవేశం పట్టలేక. తత్ఫలితంగా ఉద్భవించిన మహేశం ఆర్తనాదం, పద్మనాభం హాహాకారం, రాఘవరావు హుంకారం తోటి కాస్సంత బాయిలర్ చల్లబడింది. ఒణుకుతున్న చేతులతో మహేశం నా చేతులు పట్టుకునే టప్పటికి నా ఒళ్ళు కూడా పూర్తిగా చల్లబడింది

ఇంటికి తిరిగి వస్తూంటే నా ఆవేశానికి నాకే నవ్వొచ్చింది మా వాడు భార్యని అదుపాజ్ఞల్లో పెట్టుకోలేకుండా పోతాడేమో ననుకోడానికి, మహేశం తన కూతురు చిలక పలుకులకి తాళం వేయడానికి కారణం మాకు మా పిల్లల మీదవుండే అప్యాయమే కాని, యిందులో ఆవేశానికి, ఆగ్రహానికి తావెక్కడుంది. అదీ గాకుండా వాళ్ళిద్దరూ మోజుపడి ప్రేమించి పెళ్ళాడుకుంటూం మొర్రో అంటూంటే మధ్య శకున పక్షిలాగ నేనడ్డం పెట్టడం దేనికి! నిజానికి రాఘవరావన్నట్టు పెళ్ళయ్యే వరకూ నేగాని, దాని తర్వాత ప్రతి ఆడది గాజులు తొడిగించుకున్న మహా పతివ్రతే. సంసార బాధ్యత మీదపడేటప్పటికి యీ వెర్రి వెర్రి వుపన్యాసాలూ—ఈ ధోరణి పూర్తిగా మారుతుంది.

సరాసరి వంటింట్లో కెళ్ళి మా ఆవిడతో విషయాలన్నీ చెప్పి యీ పెళ్ళిమాత్రం నా కిష్టంలేదని, వీలైతే కుర్రాడికి నచ్చచెప్పమని

రహస్యంగా ఓ అస్త్రం సంధించేను. మా ఆవిడకి రహస్యం చెప్పడ మంటే రేడియో సిలన్‌లో ఎడ్వర్‌టైజ్‌మెంట్ యివ్వడంలాంటిది. కాబట్టి తక్షణం పొగలుకక్కుకుంటూ ప్రళయ కాళీరూపంలో మా కుర్రాడి ఎదుట నిలబడేటప్పటికి ఎందుకైనా మంచిదని గోడకానుకుని మరీ నిలబడ్డాను.

రాబోయే కోడలు షరతులు సరిగా నేను నూరి పోసిన వరుస లోనే దండకంలా చదివి, 'వీటన్నిటికి నువ్వు ఒప్పుకున్నావా?' అని మావాణ్ణి నిలదీసి అడగడం, దానికి వాడు టూకీగా 'అవును... సినిమాకు వెడుతున్నాను ... రాత్రి భోజనానికి రావడం ఆలస్య మౌతుంది. టా. టా...' అంటూ అక్కణ్ణుంచి జారడం, తత్ఫలితంగా నేనో గ్లాసుడు మంచినీళ్ళు త్రాగి మా ఆవిడకో మరచెంబుడు అందించ డం... ... ఒక్క క్షణంలో జరిగింది.

* * *

మా కుర్రాడి మేనమామలూ, ఇత్యాది 'తసమదీయులు' పెళ్ళి శుభలేఖలు చూసుకుని మూర్ఛ పోయారనీ, మూర్ఛ తేరిన తర్వాత అంత కట్నం యిచ్చినా చేసుకోకూడనంత సంబంధాలనుకుంటే, నా యీ దుస్సంకల్పం వాళ్ళకు ముందరే తెలిసివుంటే తాము నన్నూ, తమ కూతుళ్ళు మా అబ్బాయినే ప్రేమించి వుండక పోదుమనే వాపోయి, ఎంత భర్తృ వాక్పరిపాలనా దీక్షా పరాయణురాలైన, మహా పతివ్రతయి నప్పటికీ, కన్నకొడుకు, కట్టుకున్న మొగుడూ ఏకమై పాపభీతి లేకుండా, కావాల్సిన సంబంధాలు కాలదన్ని, కాని వాళ్ళతో వియ్యమందా లనుకుంటే తనూ (అనగా మా ఆవిడ) తాళం

వేసిందంటే, దానికి ప్రతిఫలం నేడు కాకున్నా, రేపైననూ అనుభవించి తీరుతుం'దనీ ఒక్కక్షణం ఇష్ట దేవతా ప్రార్థనచేసుకున్నారని—కొన్ని అనధికార వర్గాల నుండీ వార్తలు.

అసలు పెళ్ళి స్థిరపడిన దగ్గర్నుంచీ మా ఆవిడ ధుమ ధుమాలంకృత వదనంతో నిత్యరూప దర్శనమిస్తోంది. ఇక పెళ్ళి రోజున ఓ అర డజను హైడ్రోజను బాంబులు మింగినట్లుండి నిజరూప దర్శన మిస్తుందని, ఏమాత్రం ఆవిడ రగుల్కున్నా హిరోషిమా దృశ్యం తథ్యమని మా అబ్బాయికీ తద్వారా ఆడ పెళ్ళి వారికి ముందరే కబురు చేశాను. ఆ రోజున ఆవిడ సమక్షంలో నిలబడిన వ్వాత గాడి పొయ్యి దగ్గర కెళ్ళితే "ఎయిర్ కండిషన్డ్ రూములో" వున్నట్టుండి.

ఆ సాయంత్రానికి మాత్రం మా ఆవిడ పూర్తిగా మెత్తబడి కరుణాకిరణ ప్రసారం ప్రారంభించింది. ఈ మార్పుకు కారణం ఏమై వుంటుందంటే... ... ...ఒకటి... ...మా అబ్బాయీ జలజా చాలా అన్యోన్యంగా సంచరించడం చూసి, అంతరంగికంగా మురిసిపోవడం... రెండు... ...ఎదిగిన పిల్లలకి ఎదురు చెప్పడంకంటే యీ వయస్సులో ఔనని తాళంవేసి వాళ్ళ మెప్పును సంపాదించడమే శ్రేయస్కరమని గ్రహించడం... ...వెనక మా అమ్మాయి పెళ్ళిసందర్భంలో ఓ సారి అనుభవ మయ్యిందికదా! ఇంక ముఖ్యమైన మూడో కారణం... ... ఈ పెళ్ళి నాక్కూడా యిష్టం లేదని ఆవిడ నమ్మకం... ...తన మాట బోల్తైనా—నా మాట నెగ్గలేదని ఆవిడ సంతోషం.

* * *

పెళ్ళయి మూడు నెలలయింది. మావాడి సంసారం ఎలాగుందో చూడటానికి మా ఆవిడ పోరుపడలేక ప్రయాణమయ్యేం. బయలుదేరే ముందర మా ఆవిడతో కొన్ని విషయాలు ఖచ్చితంగా చెప్పాను.

'వాళ్ళింట్లో మడీ తడీ అంటూ సొంటూలాంటి ఆచారా లుండవు'.

'పోనీండి... నాకేం...' అంది.

'కోడలు కళ్ళకు జోడు, కాళ్ళకుజోడు, చేతికి రిష్టువాచీ పెట్టుకుని, తెలుగు, యింగ్లీషూ కలిపి మాట్లాడుతూ వుండొచ్చు'.

'కోడలుతో మాట్లాడనే మాట్లాడను'

'మరి పెదవులకి, బుగ్గలకి రంగు లేసుకుంటే'.

'వాళ్ళంతా రంగుపూసుకో మనండి - నాకేం!'

'వాళ్ళు టేబులుమీద భోజనాలు చేస్తా రనుకుంటాను'

'నెత్తిమీద పెట్టుకు తినమనండి.'

'వాళ్ళు చెంచా, కత్తీ' త్రిశూలంలాటి వాటితో అన్నం తింటా రనుకో.'

'కావలిస్తే సుత్తి, గొడ్డలి కూడా వుపయోగించుకో మంటాను.'

'వాళ్ళు పొద్దున్నే పళ్ళుతోముకోకుండా బెడ్ కాఫీ తాగు తారనుకో.'

'దవడ పళ్ళూడ గొడతాను.'

'మధ్య నీకెందుకే...చుట్టం చూపుకింద ఓ రోజు వుండి రావడానికి వాళ్ళతో దెబ్బలాటెట్టు కుంటావా ?'

'దెబ్బలాటెట్టుకోవడంకాదు ...మీరు వర్ణించినట్లే వాళ్ళక్కడ సంసారం చేస్తుంటే... ఆ యింటికి నిప్పంటించి మరీ వస్తాను'

నాకీ అనుమానం కలగక పోలేదు. మా ఆవిడ అంతటి సమర్థు

రాలే. నిజానికి నేను వర్ణించిన లక్షణాలన్నీ నాలో అజ్ఞాతంగా చెలరేగిన కోరికలు. మా ఆవిడ ఆచారం ధర్మమా అని అవన్నీ నాకు తీరని కోరికలయి పోయాయి. ఆవిడ ఆచారం, దైవభక్తి, పతిభక్తి (షరా: దానికి ఆవిడ నిఘంటువులో ప్రత్యేక నిర్వచనం వుంది)...... వాటి మూలాన్నే మా సంసారం యీ మాత్రమైనా నెగ్గుకొస్తున్నామనీ లేకపోతే ఏనాడో అధఃపాతాళానికి పోయివుండు మని ఆవిడ విశ్వాసం. కాదని రుజువుచేసే అవకాశం కాని, పట్టుదల కాని నాకు లేవు.

* * *

మమ్మల్ని చూడగానే మా అబ్బాయి సంతోషంతో ఎలక్ట్రన్ లౌడ్ స్పీకర్‌లాగా 'జెల్లీ......అమ్మా-నాన్నా ఒచ్చేరు' అని పొలికేక వేశాడు. 'జెల్లీ' అంటే జలజకి ముద్దుపేరనుకుంటాను. ఇంతకీ కట్టుకున్న పెళ్ళాన్ని 'ఏమే', 'ఒసే' అనడం తప్ప పేరెట్టి పిలవడమే నేరమనుకునే సంప్రదాయానికి చెందినవాళ్ళ మవడంవల్ల యీ 'జెల్లీ', 'జెర్రీ' ఏమిటూ అని వెర్రిమొహం పెట్టి నా వైపు చూస్తున్న మా ఆవిడ మొహంలోకి సూటిగా చూళ్ళేకపోయాను. మొత్తంమీద యిది మా ఆవిడకి మొదటి 'షాక్'. కేక విని మా కోడలు లోపల్నుంచి బయటికొచ్చేటప్పటికి నా కళ్ళు నేను నమ్మలేక పోయాను. ఈ షాక్ నా వంతు. మా అబ్బాయి మొహంలోకి చూశాను జాలిగా. నిప్పు తొక్కిన వాడిలాగ కుప్పిగంతులు వేస్తూ "ఇంకా పూజకాలేదూ! అయినంతవఱకు వచ్చిన పుణ్యం చాలు...... ముందర కాఫీ పెట్టు" అన్నాడు. 'వరలక్ష్మి పూజ చేసుకుంటున్నావా ఏమిటి? తల్లీ, వెళ్ళు......పూజ చేసుకుంటూ వుండు, ఇప్పుడు కాఫీ వద్దు, గీఫీ వద్దు. అన్నీ దార్లో అయ్యేయి...... నేను స్నానం చేసి వస్తాను.' అంటూ చేటంత మొహం చేసుకుని మా ఆవిడ లోపలి కెళ్ళింది.

తసారని జుట్టు, కాటుక కళ్ళు, పట్టుచీర, కాళ్ళకి పసుపు, పెద్ద కుంకం బొట్టూ... ...యూకీగా వర్ణించాలంటే అదీ మా కోడలు ప్రత్యక్షమైన రూపం. మా వాడి కుర్చీ ఎదురుగావున్న కుర్చీలో చతికిల బడ్డాను సిగరెట్ పెట్టి, అగ్గిపెట్టి, కింద పడ్డ సిగరెట్ పీకలు నాకు కనపడకుండా వుండాలని లాగుంది; చాలా నేర్పుగా మా వాడు బల్ల క్రిందకు నెట్టేస్తున్నాడు. అటు చూడట మెందుకని యింట్లోకి చూశాను. మా ఆవిడ లోపలికి రమ్మని సౌజ్ఞచేసి, 'కోడలు వరలక్ష్మీవ్రతం పూజచేసుకుంటుంటే అలా కూర్చుంటారేమిటి! ...త్వరగా బజారు కెళ్ళి ఓపట్టుచీర, రవిక తీసుకురండి' అని పురమాయించింది.

*  *  *

ఆ రాత్రి డాబా మీద పడుకున్నాను. పక్క మంచంమీద మా ఆవిడ, కోడలూ గుసగుస లాడుకుంటున్నారు. వాళ్ళ తల్లో మల్లెపూల సువాసనా, పైన చల్లని వెన్నెల, పక్కమీద తెల్లని దుప్పటి... మునిమాణిక్యంలో 'కథ'లో వర్ణన జ్ఞాపకం వస్తోంది. మా వాడు ఫస్ట్‌బెల్ కొట్టేసి క్రిందకు వెళ్ళిపోయి పడుకున్నాడు. మా ఆవిడ మాత్రం కోడలు కొంగు పట్టుకొని యింకా వేళ్ళాడుతోంది. నేను నిద్ర నటిస్తూ కళ్ళు మూసుకున్నాను. క్రింద నుంచి రేడియోలో సిలోన్ తాలూకు అస్ప్రో కార్యక్రమం వినబడుతోంది.

'మరి... ...మీ మామగా రేమన్నారో తెలుసా!' అంటూ తన నిత్య సత్యవ్రతానికి భంగం కలుగకుండా వున్నవి లేనివి కల్పించి... 'అసలు నువ్వో దొరసాని వన్నట్టు వర్ణించేరు' అంది మా ఆవిడ.

'అచ్చే! మన ఆచారాలు, సంప్రదాయాలు అంటే నాకు చాలా అభిమానం. చదువులవల్ల నేర్చుకోవలసింది షోకులూ, నాస్తికత్వమూ కాదు' అంది మా కోడలు. దాంతోటి మా ఆవిడ సంతోషంతో ఉక్కిరి బిక్కిరైపోయి వుంటుంది.